
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



భీమిలి ప్రేమలు 8లో

ప్రేమ కథా చిత్రాల చిత్రీకరణకు భీమిలి స్వర్గధామంలా నిలిచింది. ఇక్కడ ఎన్నో సూపర్ హిట్ ప్రేమకథా చిత్రాలు చిత్రీకరించారు.



ఆక్రమణలు తొలగించండి

పూర్ణా మార్కెట్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. 8లో

ప్రియమైన ప్రేమికులకు..

వాలెంటైన్స్ డే సందర్భంగా నగరం మొత్తం ప్రేమమయ వాతావరణంతో నిండి పోయింది. 8లో



కరెంట్ భారం రూ.250 కోట్లు



ఉమ్మడి విశాఖ జిల్లాలో...

ఎల్‌టీ కేటగిరీ వినియోగదారులు
18,42,691

ప్రతి నెలా డిమాండ్
రూ.1,457.01 కోట్లు

హెచ్‌టీ కేటగిరీ
వినియోగదారులు 1,858

ప్రతి నెలా డిమాండ్
రూ.3,903.51 కోట్లు

మొత్తం వినియోగదారులు
18,44,549

మొత్తం డిమాండ్
రూ.5,360.52 కోట్లు

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా అదనపు భారం
రూ.250 కోట్లు



ఒక యూనిట్ వినియోగానికి రూ.400 బిల్లు వేసిన ఈపీడీసీఎల్

- ప్రతి నెలా అదనపు చార్జీల పేరుతో దోచుకుంటున్న డిస్కమ్
- ఒక్క యూనిట్‌కి రూ.400 బిల్లు వేసిన ఏపీఈపీడీసీఎల్
- సంపద సృష్టిస్తామంటూ ప్రజల సంపద హరిస్తున్న ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోం.. అవసరమైతే తగ్గిస్తామంటూ ఊదరగొట్టిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ఇప్పుడు సంపద సృష్టి పేరుతో పేదల కష్టాన్ని లాగేసుకుంటున్నారు. తమ ఖజానా నింపేసుకునేందుకు సామాన్యుల **సంపదను హరించే**స్తున్నారు. **ప్రతి నెలా రకర**కాల చార్జీల **పేరుతో** విద్యుత్ **బిల్లులు** వేస్తుంటే.. **విని**యోగదారుల గుండె గుభేల్ మంటోంది. ఈపీడీసీఎల్ పరిధిలో ఒక్క యూనిట్ విద్యుత్ వాడినా.. అసలు పూర్తిగా వాడకపోయినా సరే.. కనీసం రూ.400 బిల్లు బాదేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉమ్మడి విశాఖ జిల్లాలో విద్యుత్ వినియోగదారుల మీద **నెలకు రూ.250 కోట్లకు పైగా భారం** పడుతోంది.

జేబులకు చిల్లులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు అసలు కంటే కొసరు చార్జీలే షాక్ కొడుతున్నాయి. వివిధ రకాల చార్జీల పేరుతో గత రెండు మూడు నెలలుగా ఈపీడీసీఎల్ జారీ చేస్తున్న బిల్లులు జనం జేబులకు చిల్లులు పెడుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులు 18,44,549 మంది ఉండగా.. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు రూ.5,360.52 కోట్లు వినియోగదారుల నుంచి ఈపీడీసీఎల్ వసూలు చేస్తోంది. ఎఫ్‌పీపీసీఏ, ఎఫ్‌పీపీసీఏ-2, ఎఫ్‌పీపీసీఏ-3.. ఇలా పలు రకాల చార్జీల భారం మోపేస్తోంది. ఇలా మొత్తంగా ప్రతి నెలా రూ.250 కోట్లను విద్యుత్ వినియోగదారుల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తోంది.



వేసవిలో బిల్లులు తడిసి మోపెడు.!

వివిధ రకాల విద్యుత్ చార్జీల వసూలుతో చలికాలంలో విద్యుత్ వాడకం తగ్గినా బిల్లులు మాత్రం పెరుగుతుండడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సగటున యూనిట్ ధర రూ.3.21 ఉంటే.. ప్రస్తుతం యూనిట్ ధరకు ఐదు రెట్లు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. దాదాపు 13 రకాల సుంకాలను వసూలు చేస్తుండడంతో యూనిట్ ధర రూ.15 వరకూ ఉంటోంది. బిల్లు చెల్లించడంలో కాస్తా జాప్యం జరిగినా.. అపరాధ రుసుముతో సహా బిల్లులు వసూలు చేయాలని డిస్కమ్‌లకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేశాయి. చలికాలంలోనే వేల రూపాయల బిల్లులు బాదేస్తున్న ఈపీడీసీఎల్.. రాబోతున్న వేసవిలో బిల్లులు కట్టేందుకు ఆస్తులన్నీ అమ్ముకోవాలేమోననే ఆందోళన చెందుతున్నారు.

వచ్చిన జీతంలో సగం బిల్లులకే



గతేడాది జనవరి నెలలో రూ.450 బిల్లు వచ్చింది. ఈ ఏడాది జనవరిలో రూ.1,020 బిల్లు వచ్చింది. డిసెంబర్ బిల్లు కలిసిపోయిందేమోనని అనుకున్నాను. ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే అదే అంతే అమౌంట్ కనిపిస్తోంది. రూపాయి పెంచమని చెప్పినవాళ్లు.. ఇలా వేల రూపాయిల బిల్లులు కట్టమని చెప్పడం ఎంతవరకూ కరెక్ట్. వచ్చిన జీతంలో సగానికి పైగా.. అన్ని బిల్లులకే సరిపోతోంది. ఇంక ఎలా బతకగలం చెప్పండి. – కె.అప్పారావు, ప్రైవేట్ ఉద్యోగి, పెందుర్తి

చంద్రబాబు చెప్పిందేంటి..?



మా గవర్నమెంట్ వస్తే కరెంట్ చార్జీలు ఒక్క రూపాయి పెంచం. సంపద సృష్టించడం తెలుసు కాబట్టి.. పేదలపై భారం వెయ్యమని చెప్పారు. కానీ.. ఇప్పుడు చంద్రబాబు చెప్పిందేంటి.. చేస్తోందేంటి.? రెండింటికీ సంబంధమే లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సామాన్య ప్రజలకు ఒక్క రూపాయి ఉపయోగం లేదు సరి కదా.. కరెంట్ బిల్లులు పేరుతో దోపిడీ చేసేస్తున్నారు. వేసవి కాలం వస్తోందని తలచుకుంటేనే భయమేస్తోంది. – పి.నల్లయ్య, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 10 మంది

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో పది మంది అభ్యర్థులు నిలిచినట్లు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం గడువు కాగా.. ఏ ఒక్కరూ ఉపసంహరించుకోలేదని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో డీసీపీ అజిత, ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీశంకర్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 27వ తేదీ పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ జరగనుందని తెలిపారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, దానిలో భాగంగా వివిధ స్థాయి అధికారులతో 12 ఎంసీసీ బృందాలను నియమించామని చెప్పారు. అలాగే మండలానికి ఒకటి చొప్పున 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

ఓటర్లు 22,493.. పోలింగ్ కేంద్రాలు 123

ఉత్తరాంధ్ర పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుష ఓటర్లు 13,508 మహిళా ఓటర్లు 8,985 మంది ఉన్నారని పేర్కొన్నారు. అలాగే 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూరుస్తున్నామని, వెబ్ కాస్టింగ్, వీడియో గ్రఫీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఓటర్లకు వివరాలతో కూడిన స్లిప్పులను అందజేస్తామన్నారు.

ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్!

కౌంటింగ్ ప్రక్రియను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి నివేదించామని ఆమోదం వస్తే పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఈఈఈ బ్లాక్‌ను గుర్తించామని వివరించారు. డీసీపీ అజిత మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఎన్నికలకు అభ్యర్థులు సహకరించాలి

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నామినేషన్ ఉప సంహరణ ప్రక్రియ గడువు ముగిసిన వెంటనే పోటీలో ఉంటున్న అభ్యర్థులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, ప్రచారం, అనుమతుల విషయంలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. వాహనాలు, కరపత్రాల ముద్రణ, ప్రచారం వంటి అంశాలకు సంబంధించిన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో డెస్కు ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి నేరచరిత్ర లేని వారిని పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలని సూచించారు. పోలింగ్‌కు 48 గంటల ముందుగా ప్రచారం నిలిపివేయాలని చెప్పారు.

ఏటీఎల్ పోటీల్లో గురుకులం ప్రాజెక్టుల ఎంపిక

ఆరిలోవ: నేషనల్ స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రాంలో భాగంగా అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) పోటీల్లో శ్రీకృష్ణాపురం గురుకులానికి చెందిన రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. గతేడాది నవంబర్‌లో గురుకులం ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు సీతారాం ఆధ్వర్యంలో ఎ.రాము(7వ తరగతి), కె.యోగి(8వ తరగతి) తయారు చేసిన సెన్సార్ బేస్డ్ వెదర్ రెస్పాన్స్ క్లాత్స్ డ్రయింగ్ సిస్టం, హేలియా(7వ), బి.మహేష్(8వ) రూపొందించిన సెన్సార్ బేస్డ్ ఆటో హెడ్ వాటర్ ట్యాప్ ప్రాజెక్టులను ఏటీఎల్‌కు పంపినట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీలకు లక్షకు పైగా వచ్చిన ప్రాజెక్టుల్లో దేశ వ్యాప్తంగా 1,500 ప్రాజెక్టులు ఎంపిక చేశారని, వాటిలో విశాఖ జిల్లాకు చెందిన 7 ప్రాజెక్టులున్నట్లు వెల్లడించారు. అందులో తమ విద్యార్థులకు చెందిన రెండు ప్రాజెక్టులు ఎంపికవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జూన్ 18న ఆన్‌లైన్ ద్వారా ఏటీఎల్ ప్రతినిధులతో తమ విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టుల ఉపయోగం, పని తీరును వివరిస్తారని తెలిపారు.



ప్రాజెక్ట్‌లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

16.02 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం



గణేష్‌నగర్‌లో ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న దేవస్థానం అధికారులు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న దేవస్థానం అధికారులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ రైతుబజార్ సమీపంలోని గణేష్‌నగర్ వద్ద సర్వే నంబర్ 270లో సింహాచలం దేవస్థానానికి చెందిన 16.02 ఎకరాల భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి ఆధ్వర్యంలో దేవస్థానం అధికారులు గురువారం ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు మాట్లాడుతూ 1983లో ఒక సొసైటీ.. సదరు భూమిని తమకు కేటాయించాలని ప్రతిపాదించిందన్నారు. అయితే న్యాయస్థానం ఆ ప్రతిపాదనను రద్దు చేస్తూ ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని దేవదాయశాఖకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో 16.02 ఎకరాల స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.. దేవస్థానం భూమిని ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఈవో హెచ్చరించారు. స్థలాలను పరిరక్షించేందుకు చుట్టూ ఫెన్సింగ్ వేస్తామన్నారు. కాగా.. కాశీ అసోసియేట్స్ అధినేత బొడ్డేటి కాశీ విశ్వనాథానికి చెందిన స్థలంలో కూడా బోర్డు ఏర్పాటు చేసేందుకు ఈవో, సిబ్బంది వచ్చారు. అయితే ఈ భూమికి సంబంధించి క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వానికి చలానాలు చెల్లించినట్లు తెలిపి, పత్రాలను ఈవోకు విశ్వనాథం చూపించారు. 2003లో తాను 500 గజాలు, 300 గజాల స్థలాలకు నగదు చెల్లించి రశీదులు పొందినట్లు చెప్పారు. అప్పటి నుంచి నేటి వరకు ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నట్లు వివరించారు.

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని అనుచరుల అరెస్ట్

ఆరిలోవ: మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులను విశాఖలో పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొన్నారు. గురువారం తెల్లవారుజామున విజయవాడ పోలీసులు విశాఖ చేరుకొని ఆరిలోవ పోలీసుల సహకారంతో విశాలాక్షినగర్‌లో ఇంటిని చుట్టుముట్టారు. విజయవాడ నుంచి వచ్చిన ముగ్గురితో పాటు ఆ ఇంటి యజమాని ఎలినేని దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఇక్కడ నుంచి విజయవాడకు తీసుకెళ్లారు. బంధువులతో పాటు దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేయడంపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల తీరును తప్పపడుతున్నారు. ఇదిలా ఉండగా విజయవాడ పోలీసులకు సహకారం అందించామని, ఎవరిని అరెస్టు చేశారో తమకు తెలియదని ఆరిలోవ పోలీసులు వెల్లడించారు.

మేము టీడీపీ అభిమానులం

మేము టీడీపీ అభిమానులం.. టీడీపీ గెలిచినప్పుడు సంబరాలు చేసుకున్నాం.. తన కుమారుడు ఎలినేని దుర్గాప్రసాద్‌ను ఇప్పుడు ఎందుకు అరెస్టు చేశారో పోలీసులు చెప్పడం లేదని ఆయన తల్లి శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ నుంచి బంధువులు వచ్చారని.. వారిని కూడా అకారణంగా అరెస్టు చేశారని వాపోయారు. పోలీసులు తన కుమారుడు, మిగతా ముగ్గురిని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.

నారాయణలో ఘోరం

భవనంపై నుంచి దూకిన విద్యార్థి మృతి

- అధిక ఒత్తిడే కారణమని తల్లి ఆరోపణ
- మృతుడు ఒడిశా రాష్ట్రం బార్‌గఢ్ జిల్లా వాసి
- పరదేశిపాలెంలో సరస్వతి భవన్-3 క్యాంపస్‌లో ఘటన
- విద్యార్థి సంఘాల ఆందోళనతో ఉద్రిక్తత





ఆస్పత్రిలో చంద్రవంశీ మృతదేహం

మధురవాడ: ర్యాంకుల కోసం అధిక ఒత్తిడి, ధన దాహం, నిర్లక్ష్యం అన్నీ కలిపి విద్యార్థుల ప్రాణాలతో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయి. నారాయణ విద్యా సంస్థల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. విద్యార్థుల వరుస ఆత్మహత్య ఘటనలతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్నాళ్ల కిందట పీఎంపాలెం నారాయణ క్యాంపస్‌లో, ఆ తర్వాత చైతన్య కళాశాలలో అధిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇటీవల అనంతపురంలో జరిగిన ఘటన మరువకముందే మధురవాడ సమీపంలోని పరదేశిపాలెం నారాయణ విద్యా సంస్థల విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సరస్వతి భవన్-3లో ఇంటర్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్న కోన చంద్రవంశీ (17) హాస్టల్ ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి 10.30 సమయంలో అందరూ చూస్తుండగానే కనీసం గ్రిల్స్ కూడా లేని గోడపై నుంచి దూకడంతో తోటి విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యార్థులు ఏదో అనడం వల్లే చంద్రవంశీ దూకేశాడని ఫ్యాకల్టీ చెబుతుండడం గమనార్హం. ప్రత్యక్ష సాక్షులు కూడా జరిగిన విషయం చెప్పేందుకు భయపడుతుండటం చూస్తుంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటనకు సంబంధించి నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు తెలిపిన వివరాలివీ..

ఒడిశా రాష్ట్రం బార్‌గఢ్ జిల్లా కుల్తాతుకురాకు చెందిన తేజబాట్, వీరభద్రరావుల రెండవ సంతానం చంద్రవంశీ. వీరభద్రరావు కొన్నేళ్ల కిందట మృతి చెందడంతో తల్లి టైలరింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. కుమారుడిని పరదేశిపాలెం నారాయణ సరస్వతి భవన్-2 క్యాంపస్‌లో జాయిన్ చేసింది. గతేడాది నవంబర్‌లో హాస్టల్ బాత్‌రూంలోనే చంద్రబాబు కాలు జారి పడిపోగా చేయి విరిగిపోయింది. నయం అయిన తర్వాత ఈ ఏడాది జనవరిలో చంద్రవంశీ క్యాంపస్-3లో చేరాడు. గురువారం కెమిస్ట్రీ ప్రీ ఫైనల్ ఎగ్జామ్ ఉండగా.. బాగా చదవకపోతే పరీక్ష పాస్ అవ్వవని స్టడీ అవర్‌లో అందరి మధ్యలోనే అధ్యాపకుడు మందలించినట్లు సమాచారం. దీంతో అతను మనస్తాపానికి గురయ్యాడు. రాత్రి చంద్రవంశీ భోజనం చేయలేదు. ఈ క్రమంలో స్టడీ రూమ్ నుంచి బయటకు వచ్చి మేడపై నుంచి దూకేశాడు. చికిత్స నిమిత్తం సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తీసుకు వెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. తల్లి ఫిర్యాదుతో పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యాజమాన్యం అధిక ఒత్తిడి కారణంగానే తమ బిడ్డ ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి తల్లి ఆరోపిస్తున్నారు. రాత్రి 11.30 గంటల వరకు తమకు సమాచారం ఇవ్వలేదని వాపోతున్నారు. పైగా సంఘటన స్థలిని కూడా ఆగమేఘాల మీద శుభ్రం చేయడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.



విద్యార్థి సంఘ నాయకులను బలవంతంగా అరెస్ట్ చేస్తున్న పోలీసులు

విద్యార్థి సంఘాల ఆందోళనతో ఉద్రిక్తత

నారాయణ కళాశాల యాజమాన్యం ఒత్తిడి వల్లే విద్యార్థి మృతి చెందాడని, యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు డిమాండ్ చేశారు. కళాశాల వద్ద ఆందోళనకు దిగడంతో పోలీసులు ఎస్ఎఫ్ఐ ప్రతినిధులను ఈడ్చిపడేశారు. జిల్లా అధ్యక్షుడు అజయ్, నాయకులు రాము, సాయితేజ, అరుణ్, హర్షిత్, సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్ తదితర 9 మందిని అరెస్ట్ చేశారు. వారిని తీసుకువెళ్తున్న జీపును మరికొందరు అడ్డుకున్నారు. ఉద్రిక్త పరిస్థితుల మధ్యే వారిని ఆనందపురం స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఏబీవీపీ నాయకులు కళాశాల వద్ద నిరసన తెలిపారు.



క్యాంపస్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

నారా దేవాన్ష్‌ను 'నారాయణ'లో చదివించాలి

మంత్రి లోకేష్ కుమారుడు నారా దేవాన్ష్‌ను నారాయణ విద్యా సంస్థలో చదివిస్తే అక్కడి పరిస్థితి, యాజమాన్యం ఒత్తిడి తదితర విషయాలు తేటతెల్లం అవుతాయని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎల్ఎన్ వాసు అన్నారు. పరదేశిపాలెం క్యాంపస్‌లో విద్యార్థి ఆత్మహత్యపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ర్యాంకుల కోసం అధ్యాపకులు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రి కళాశాలకు 4 అంచెల పోలీసు భద్రత

రాష్ట్ర మంత్రి నారాయణకు చెందిన విద్యా సంస్థ కావడంతో సంఘటన జరిగిన తర్వాత బుధవారం రాత్రి 11 గంటల నుంచి ఎవ్వరినీ కళాశాల దగ్గరకు రానివ్వలేదు. ఒక ఏసీపీ, నలుగురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 10 మందిపైనే కానిస్టేబుళ్లతో నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేయడం విస్మయానికి గురి చేసింది.

నివేదిక కోరిన సీఆర్‌పీఎఫ్

విద్యార్థి మృతిపై ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థి అధిక ఒత్తిడి కారణంగా మృతి చెందాడా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా.? తదితర విషయాలపై సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఐటీఐలో జాబ్‌మేళా నేడు

కంచరపాలెం: కంచరపాలెం దరి ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె శ్రీకాంత్ తెలిపారు. దుబాయికి చెందిన ఈమీకామ్ సర్వీసస్, హైదరాబాద్‌కి చెందిన ఈక్విక్, డైస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఐటీఐలో ఫిట్టర్, మెషీనిస్ట్, టర్నర్ ట్రేడుల ఉత్తీర్ణత చెంది, 18–25 లోపు వయసు గల అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 91219 83798 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఏలూరులో వందే భారత్‌కు హాల్ట్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరు స్టేషన్‌లో మరో ఆరు నెలలపాటు హాల్ట్ పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం- సికింద్రాబాద్ (20707) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.49 గంటలకు ఏలూరు చేరుకొని, అక్కడ నుంచి 9.50గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్-విశాఖపట్నం(20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.44 గంటలకు ఏలూరు చేరుకొని అక్కడ నుంచి 5.45 గంటలకు బయల్దేరుతుంది.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో(ఇంగ్లిష్ మీడియం) ప్రవేశాలు కల్పించనున్నారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు గురుకులంలో లేదా ఆన్‌లైన్‌లో మార్చి 6లోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు https://apbragcet.apcfss.inను సందర్శించవచ్చు.

వీఎంఆర్డీఏ సీఈగా వినయ్‌కుమార్

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజనీర్‌గా వినయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ స్థానంలో ఎస్ఈ భవానీశంకర్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. చాలా కాలం తర్వాత ప్రభుత్వం సీఈగా వినయ్‌కుమార్‌ను నియమించింది. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్దేశిత గడువులోగా వీఎంఆర్డీఏ ప్రాజెక్ట్‌లు పూర్తి చేసేలా చూడాలని చైర్మన్ సీఈకి సూచించారు.

జాతీయ స్థాయిలో మెరిసిన పూర్ణిమ

- నాలుగు పతకాలు సాధించిన ఎస్‌ఎఫ్‌ఎస్ టీచర్



పూర్ణిమను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోజ్

సీతమ్మధార: ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ఉపాధ్యాయిని కె.పూర్ణిమ జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అద్భుత విజయం సాధించారు. రాజస్థాన్ ఆళ్వార్‌లోని రాజ్ రిషీ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఇటీవల జరిగిన 44వ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆమె సత్తా చాటి.. స్వర్ణం, రెండు రజతాలు, కాంస్య పతకాలు సాధించారు. పోటీల అనంతరం పాఠశాలకు గురువారం చేరుకున్న ఆమెకు ఎస్‌ఎఫ్‌ఎస్ సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ ఫాదర్ పి.మనోజ్, ఉపాధ్యాయులు సైమన్ తమిళరసి, టి.శోభ, వై.మహాలక్ష్మి, జాకీ, మేరీ క్లేర్ లాజరస్ తదితరులు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం చీఫ్ పేట్రన్ కమల్ బయద్, చీఫ్ అడ్వయిజర్ చింతలపాటి సత్యదేవ్, అధ్యక్షుడు మంగ వరప్రసాద్, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ కె.వి.జోసఫ్, తన భర్త శివ సతీష్ కుమార్ ప్రోత్సాహంతో ఈ విజయాలు సాధించినట్లు చెప్పారు.

రెయిలింగ్ తగిలి యువకుడి దుర్మరణం



తీవ్ర గాయాలతో రొంగాల ప్రణీత్



ప్రణీత్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: డీమార్ట్‌లో ట్రైనింగ్‌కు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. చట్టివానిపాలెంలో నివాసం ఉంటూ ప్రైవేట్ పనులు చేసుకుంటున్న రొంగాల రవికుమార్, కంచరపాలెం అక్షయపాత్రలో పనిచేస్తున్న లక్ష్మి దంపతులకు ప్రణీత్ (24) ఒక్కడే కుమారుడు. ప్రణీత్‌కు ఇటీవల కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద గల డీమార్ట్‌లో ఉద్యోగం వచ్చింది. కొన్ని రోజుల పాటు శిక్షణ అవసరం ఉండటంతో.. గురువారం ఉదయం 7 గంటల సమయంలో తన స్కూటీపై డీమార్ట్‌కు బయలుదేరాడు. షీలానగర్ సిగ్నల్ పాయింట్ దాటి కొంత దూరం వెళ్తుండగా తన స్కూటీ ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ ఘటనలో స్కూటీపై నుంచి ప్రణీత్ జారిపడగా.. రోడ్డు పక్కనున్న రెయిలింగ్ తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. తీవ్ర గాయాలపాలైన ప్రణీత్‌ను హైవే అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. దురదృష్టవశాత్తూ మార్గమధ్యలోనే యువకుడు మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

భీమిలి ప్రేమలు

ప్రేమ కథా చిత్రాలకు ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. తరాలు.. అభిరుచులు మారుతున్నా ప్రేమకథా చిత్రాలకు ఆదరణ మాత్రం తగ్గడం లేదు. ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు, మధురమైన సంగీతం, హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ వెరసి ప్రేమ కథా చిత్రాలు మర్చిపోలేని అనుభూతిని మిగులుస్తాయి. అందుకే ఈ జానర్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తాయి. ఎన్నో ప్రేమకథా చిత్రాల ద్వారా ఎంతో మంది నటీనటులు వెలుగులోకి వచ్చారు. కేవలం నటీనటులే కాదు.. ఈ చిత్రాలు చిత్రీకరించిన ప్రాంతాలు కూడా సినీ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయాయి. వాటిలో కొన్ని ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలుగా కూడా అభివృద్ధి చెందాయి. అలాంటి వాటిలో మన జిల్లాలోని భీమిలి ఒకటి. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– భీమునిపట్నం

ఎన్నో ప్రేమకథా చిత్రాల షూటింగ్‌లు ఇక్కడే..

వెండితెర ప్రేమకథలకు చిరునామా

ప్రేమ కథా చిత్రాల చిత్రీకరణకు భీమిలి స్వర్గధామంలా నిలుస్తోంది. ఇక్కడ ఎన్నో సూపర్ హిట్ ప్రేమకథా చిత్రాలు చిత్రీకరించారు. ఇందుకు కారణం ప్రకృతి సౌందర్యం, ప్రశాంతమైన వాతావరణం, చారిత్రక కట్టడాలు. ఇక్కడ సముద్రతీరం ఎంతో మంది సినీ దర్శకులను ఆకర్షించాయి. విశేషం ఏమిటంటే విభిన్న నేపథ్యాలున్న ప్రేమకథలకు భీమిలి సరిగ్గా సరిపోతుంది. పల్లెటూరి ప్రేమకథల నుంచి పట్టణ ప్రేమకథల వరకు, చారిత్రక ప్రేమకథల నుంచి సమకాలీన ప్రేమకథల వరకు ఏదైనా ఇక్కడ చిత్రీకరించవచ్చు.

ఎన్నో చిత్రాలు..

భీమిలి బీచ్, పరిసర ప్రాంతాల్లో శుభలేఖ, ముద్దమందారం, మహర్షి తదితర తెలుగు చిత్రాలతో పాటు కొన్ని హిందీ, తమిళ చిత్రాల షూటింగ్‌లు కూడా జరిగాయి. 1991లో దర్శకుడు సెల్వమణి(ఆర్.కె.రోజా భర్త) రోజాతో 'చామంతి' అనే ప్రేమ కథా చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలోని ముఖ్య సన్నివేశాలను బ్యాంక్ రోడ్డులోని ఓషన్ వ్యూ బంగ్లా వద్ద చిత్రీకరించారు. 'రావోయి చందమామ', 'టైం' చిత్రాల్లోని ప్రేమ సన్నివేశాలను ఇక్కడే తీశారు. నరసింహస్వామి ఆలయం వద్ద శ్రీవారికి ప్రేమలేఖ, కోకిలమ్మ చిత్రాల షూటింగ్ జరిగింది. నవీన్ చంద్ర హీరోగా బ్రో, శ్రీనివాసరెడ్డి, పూర్ణ హీరోహీరోయిన్లుగా నటించిన జయమ్ము నిశ్చయమ్మురా, తాజాగా నాగచైతన్య నటించిన తండేల్ చిత్రాల షూటింగ్‌లు భీమిలి పరిసర ప్రాంతాల్లోనే జరిగాయి.

ఇప్పటికీ అలానే..

ఒక్క గాలిమేడ తప్పించి మిగిలిన నిర్మాణాలు ఇప్పటికీ అలానే ఉన్నాయి. బీచ్ దగ్గరలో గ్రంథాలయం పక్కన స్కూల్, దిమ్మ, దగ్గరలో ఇల్లు చెక్కు చెదరకుండా ఉన్నాయి ఇక్కడకు వచ్చే సందర్శకులు వీటిని చూడవచ్చు. బ్యాంక్ రోడ్డులో ఓషన్ వ్యూ బంగ్లా కూడా అలాగే ఉంది. ఇలా భీమిలి కేవలం సినిమా షూటింగ్‌లకే కాకుండా పర్యాటకంగా కూడా ఎంతో అభివృద్ధి చెందింది. సినిమాల్లో చూపిన అందమైన ప్రదేశాలను ప్రత్యక్షంగా చూడటానికి పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు.మొత్తానికి ప్రేమకథా చిత్రాలకు, భీమిలికి విడదీయరాని అనుబంధం ఏర్పడింది.



దర్శకుడు సెల్వమణి రోజాతో రూపొందించిన చామంతి చిత్రంలో చాలా సన్నివేశాలు ఈ బంగ్లాలోనే తీశారు

మరో చరిత్ర.. చెరగని ముద్ర

భీమిలిలో చిత్రీకరించిన ఓ సినిమా పేరు చెప్పండి అంటే మరో ఆలోచన లేకుండా 'మరో చరిత్ర' అని చెబుతారు. ఇక్కడి అందమైన లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సినిమా 1978లో విడుదలై అందరి మనసుల్లో చెరగని ముద్ర వేసింది. కె.బాలచందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కమలహాసన్, సరిత ముఖ్య పాత్రలు పోషించారు. 1850 ప్రాంతంలో డచ్ గవర్నర్ నివసించడానికి అరుదైన బంగ్లా నిర్మించారు. దీనిని 'గాలిమేడ' అని పిలిచేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దానిని ఎవరూ ఉపయోగించకుండా వదిలేశారు.'మరోచరిత్ర'లోని ముఖ్యమైన సన్నివేశాలు, ఒక పాట ఈ గాలిమేడలోనే చిత్రీకరించారు. సినిమా పెద్ద విజయం సాధించడంతో ఈ బంగ్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. సినిమా విడుదలైన తర్వాత ఈ గాలిమేడను చూడటానికి నిత్యం అనేక మంది సందర్శకులు వచ్చేవారు. అయితే 1990 ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు ఈ స్థలాన్ని కొనుగోలు చేసి గాలిమేడను కూల్చివేశారు. కానీ ఇప్పటికీ చాలా మంది ఆ ఖాళీ స్థలాన్ని చూసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు.

జ్ఞాపకాల దొంతర.. ఆరాధన

భీమిలి గ్రంథాలయం ఎదురుగా ఒకప్పుడు సరస్వతి సమాజం ఉండేది. ఇక్కడే 1986లో ప్రముఖ దర్శకుడు భారతీరాజా దర్శకత్వంలో సత్యరాజ్ (బాహుబలిలో కట్టప్ప), రేఖ నటించిన 'కడలోర కవితైగళ్' అనే తమిళ చిత్రాన్ని చాలా వరకు ఇక్కడే చిత్రీకరించారు. ఇదే సినిమాను భారతీరాజా 1987లో 'ఆరాధన' పేరుతో తెలుగులో పునర్నిర్మించారు. చిరంజీవి, సుహాసిని నటించిన ఈ 'ఆరాధన' సినిమా షూటింగ్ కూడా చాలా రోజులు భీమిలిలోనే జరిగింది. సుహాసిని విద్యా బోధన, చిరంజీవి చదువుకోవడానికి వచ్చే సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించారు. సుహాసిని పాఠశాలకు రావద్దని చెప్పడంతో చిరంజీవి దానికి ఎదురుగా ఉన్న దిమ్మపై ఒంటి కాలిపై నిలబడే సన్నివేశం, దగ్గరలో అప్పటి లైట్‌హౌస్ కీపర్‌కు సంబంధించిన క్వార్టర్స్‌లో చిరంజీవి ఇల్లు, ఆయనకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ ఇక్కడే జరిగింది.



ఆరాధన సినిమాలో పాఠశాల సన్నివేశాలు చిత్రీకరణ జరిగింది ఇక్కడే..




ఆరాధనలో చిరంజీవి ఇల్లు ఇదే..

ఆరాధన సినిమాలో నటించాను



ఆరాధన చిత్రం ఇక్కడ సుమారు రెండు నెలల పాటు చిత్రీకరణ జరిగింది. అప్పుడు నేను 8వ తరగతి చదువుతున్నాను. ఈ సినిమాలో విద్యార్థిగానే కాకుండా, చిరంజీవి ఒంటి కాలిపై నిలబడే సన్నివేశంలో, నేను పరుగెత్తుకుంటూ వచ్చి ఆయన్ని ఆశ్చర్యంగా చూసే సన్నివేశంలో నటించాను. రోజూ ఉదయం ఏడు గంటల సమయంలో అందరికన్నా ముందు హీరోయిన్ సుహాసిని వచ్చేవారు. షూటింగ్ ప్రారంభమయ్యే లోపు నాతో పాటు మరికొందరు పిల్లలతో ఆటలు ఆడుకున్నారు. ఆ రోజులు ఇప్పటికీ గుర్తున్నాయి. – అడిదం కిశోర్, భీమిలి,



ఆరాధనలో నటించిన అడిదం కిశోర్

ఎంతో సందడిగా ఉండేది



ఇక్కడ షూటింగ్‌లు ఎక్కువ రోజులు జరగడం వల్ల ఎంతో సందడిగా ఉండేది. పరిసర ప్రాంతాల నుంచి సినిమా షూటింగ్‌లు చూసేందుకు చాలా మంది తరలివచ్చారు. ముఖ్యంగా 'ఆరాధన' షూటింగ్ చాలా రోజులు జరగడం, చిరంజీవి హీరో కావడంతో విశాఖ, విజయనగరం ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం వచ్చారు. వారిని అదుపు చేయడానికి పోలీసులు, చిత్ర యూనిట్ చాలా ఇబ్బందులు పడింది. – టి.భీమారావు, భీమిలి



ఆరాధనలో చిరంజీవి ఒంటి కాలిపై నిలబడిన సన్నివేశం ఇక్కడే తీశారు

పనులు మానుకుని వెళ్లేవాళ్లం



ఇక్కడ షూటింగ్‌లు జరిగే సమయాల్లో చూసేందుకు వెళ్లేవాళ్లం. చిరంజీవి, సుహాసిని ఇతర నటీనటులను చూసేందుకు చాలా మంది ఆసక్తి చూపారు. ఆ రోజుల్లో పనులు కూడా మానుకుని షూటింగ్ చూడటానికి వెళ్లాం. – ముగ్గు సూర్యకాంతం, భీమిలి



ప్రేమికుల కోసం ప్రత్యేకమైన బహుమతి

ప్రియమైన ప్రేమికులకు..

ప్రేమ బంధానికి 'ప్రకృతి' కానుకలు

ఏయూక్యాంపస్/బీచ్‌రోడ్డు: ప్రేమ అనేది కేవలం రెండు అక్షరాల పదం కాదు.. ఇది రెండు హృదయాలను కలిపే ఒక పవిత్ర బంధం. వాలెంటైన్స్ డే సందర్భంగా నగరం మొత్తం ప్రేమమయ వాతావరణంతో నిండిపోయింది. యువతీ యువకులు తమ ప్రియమైన వారికి ప్రేమను వ్యక్తం చేయడానికి, ఇప్పటికే ప్రేమలో ఉన్న జంటలు తమ బంధాన్ని మరింత బలపరచుకోవడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. వాలెంటైన్స్ డే అంటేనే బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం . ఒకప్పుడు గ్రీటింగ్ కార్డులు ఇచ్చిపుచ్చుకునేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. గ్రీటింగ్ కార్డుల స్థానంలో ప్రత్యేకమైన బహుమతులు వచ్చాయి. నగరంలోని షాపింగ్ మాల్స్, ప్రత్యేక దుకాణాలు ఈ బహుమతులతో నిండిపోయాయి. ప్రేమకు చిహ్నంగా గులాబీలు ఇవ్వడం అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు గులాబీలతో పాటు అందమైన మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి. గుండె ఆకారపు ఆకులతో ఉన్న హోయ కెరియా అనే మొక్క ఇప్పుడు హాట్ కేకులా అమ్ముడుపోతోంది. దీన్ని 'వాలెంటైన్ ట్రీ' అని కూడా పిలుస్తున్నారు. దీని ధర సుమారు రూ. 400 నుంచి రూ. 700 వరకు ఉంది. ప్రేమ శాశ్వతంగా నిలిచిపోవాలంటే, విశాఖపట్నం పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో ఉన్న 'ప్రేమికుల చెట్టు' దగ్గరకు వెళ్లాల్సిందే. దీనినే 'ఆటోగ్రాఫ్ ట్రీ' అని కూడా అంటారు. ఈ చెట్టు ఆకులు చాలా మందంగా ఉంటాయి. అంతేకాదు చాలా కాలం వరకు రాలవు. ప్రేమికులు తమ పేర్లను ఈ ఆకులపై రాసుకుంటారు. ఆకు ఎండిపోయినా, రాలిపోయినా ఆ అక్షరాలు చెక్కుచెదరకుండా అలానే ఉంటాయి. అలాగే 'మిలియన్స్ హార్ట్స్' మొక్క కూడా ఈ వాలెంటైన్స్ డే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వాలెంటైన్స్ డే బహుమతులలో 'రూబీ బాల్ కాక్టస్' కూడా ఒకటి. మీ ప్రేమ బంధం ఎల్లప్పుడూ ఇలాగే పచ్చగా, చిగురులు తొడుగుతూ వర్ధిల్లాలి. వాలెంటైన్స్ డే శుభాకాంక్షలు.



ఆటో గ్రాఫ్ ట్రీపై రాసిన అక్షరాలు

మంత్రి వర్గం నుంచి నారాయణను తొలగించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు

మహారాణిపేట: నారాయణ కళాశాల గుర్తింపు రద్దు చేసి.. విద్యార్థి మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నారాయణను మంత్రి వర్గం నుంచి తొలగించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. కేజీహెచ్ మార్చురీ వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పిల్లలు ఉన్నత చదువులు చదివి ఇంటికి వస్తారని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు.. కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు శవాలుగా పంపిస్తున్నారని మండిపడ్డారు. లక్షల రూపాయల ఫీజు కడుతున్న పాపానికి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటివరకు ఈ ఘటనపై స్పందించకపోవడం దారుణమని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ అన్నారు. చంద్రవంశీ సరిగ్గా చదవకపోవడం వల్లే చనిపోయాడని యాజమాన్యం సాకులు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. కాలేజీ అధినేత నారాయణ రాష్ట్ర మంత్రిగా ఉండటంతో అధికారులు దాగుడుమూతలు ఆడుతున్నారని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావత్రం కాకుండా వెంటనే నారాయణ కాలేజీలను సీజ్ చేయాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ ఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎల్.జె.జగ్గునాయుడు, సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత

భీమునిపట్నం: గొల్లలపాలెం సమీపంలోని సెడార్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 80 మంది విద్యార్థులు వసతిగృహంలో చదువుకుంటున్నారు. ఇక్కడ విద్యార్థులకు రోజూ బయట వండించిన భోజనం పెడుతున్నారు. కాగా..బుధవారం రాత్రి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న బక్క వైష్ణవి, 8వ తరగతి చదువుతున్న ఆడారి యశ్వంత్‌కు కడుపునొప్పి వచ్చింది. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న ఎంఈవోలు శివరాణి, జయప్రద గురువారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

కశింకోట ఆర్‌ఈసీ ఎస్ ఎండీగా ప్రసాద్

కశింకోట : కశింకోటలోని ఆర్ఈసీఎస్ ఎండీగా ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంటింగ్ ఇంజినీర్(ఆపరేషన్) జి.ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏపీఈపీడీసీఎల్‌తో పాటు ఆర్ఈసీఎస్ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఆటోల పరిమితి ఎత్తివేత

గోపాలపట్నం: ఆటోలపై నియంత్రణ పరిమితిని ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు జీవో నెం.8ను విడుదల చేసింది. గతంలో విశాఖలో 8300 నుంచి 8400 ఆటోలకు మాత్రమే రిజిస్ట్రేషన్లకు అనుమతి ఉండేది. ఆ తర్వాత ఆటో యూనియన్ల అభ్యర్థన మేరకు దీన్ని 8600కు పెంచారు. అందులో మహిళలకు 100 ఆటోలు కేటాయించారు. ఇప్పుడు ఈ పరిమితిని ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. వీటి స్థానంలో పొల్యూషన్ లేని ఎల్‌పీజీ, సీఎన్‌జీ, బ్యాటరీ, బీఎస్6 ఆటోలకు స్థానం కల్పించనున్నారు. కాలుష్యం లేని వాహనాలు నగర పరిధిలో తిరిగేందుకు అనుమతి ఇవ్వనున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించండి

సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశం

జగదాంబ: పూర్ణా మార్కెట్ ప్రాంతంలోగురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యటించారు. మూడు రోజుల పాటు వన్‌టౌన్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు కలసి ఫుట్‌పాత్, రహదారి ఆక్రమణలు తొలగించిన సంగతి తెలిసిందే. గురువారం కూడా పోలీసులు ఆక్రమణలు తొలగించిన నేపథ్యంలో సీపీ ఆకస్మికంగా పర్యటించారు. పూర్ణామార్కెట్ నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు రహదారికి ఇరువైపులా పరిశీలించారు. ఎక్కడ ఆక్రమణలు ఉన్నా వెంటనే తొలగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలు, వినియోగదారులు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్‌పాత్ కేవలం పాదచారులకు మాత్రమే ఉపయోపడే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. మార్కెట్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో కూడా సిబ్బందికి షిఫ్ట్ డ్యూటీలు వేస్తామన్నారు. ఆయన వెంట జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సీఐలు, సిబ్బంది ఉన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వివిధ సంఘాల నేతల నిరసన

సీతమ్మధార: దేశ అటవీ ప్రాంతాల్ని కార్పొరేట్లకు కట్టబెట్టే లక్ష్యంతో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం తలపెట్టి, ఆదివాసీలపై ప్రత్యక్ష సైనిక యుద్ధం చేస్తోందని వామపక్ష, ఆదివాసీ, హక్కుల, దళిత, ప్రజా సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆయా సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ మావోయిస్టుల నియంత్రణ పేరిట అడవుల్ని కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతో ఆదివాసీల్ని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నట్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని న్యాయ విచారణ జరిపి, బాధ్యుల్ని శిక్షించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించరాదని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్‌పై కమిటీ



మహారాణిపేట: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ జిల్లా స్థాయి కమిటీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టర్ చాంబర్లో గురువారం కమిటీ సమావేశం జరిగింది. అన్ని ఆతిథ్య సంస్థల్లో సౌకర్యాలు, భద్రత, ఇతర నిర్దేశిత అంశాలను అనుసరించాలని పర్యాటక మంత్రిత్వ శాఖతో కలిసి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు దశల్లో ప్రోగ్రాంలు ఉంటాయన్నారు. ఓరియంటేషన్ ప్రోగ్రాం/వర్క్ షాప్‌లు నిర్వహించి హోటళ్లు, లాడ్జిల్లో సేఫ్టీ శానిటేషన్, ఈకో టూరిజం, టూరిస్ట్ ఆతిథ్య నియమావళి తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో మెంబర్ సెక్రటరీగా జిల్లా టూరిజం ఆఫీసర్, మెంబర్స్‌గా జెడ్పీ సీఈవో, గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈ, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్, వీఎంఆర్‌డీఏ సెక్రటరీ, డీఎఫ్‌వో, ఏడీ ఆర్కియాలజీ, పీసీబీ అధికారి, ఏపీటీడీసీ డీఎం, స్టార్ హోటల్స్ అసోసియేషన్, నాన్ స్టార్ హోటల్స్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులను నియమించారు. డివిజనల్ లెవెల్ సబ్ కమిటీలో చైర్మన్‌గా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మెంబర్స్‌గా జోనల్ కమిషనర్, కన్వీనర్‌గా గ్రామీణ నీటి సరఫరా ఈఈ ఉంటారు.